అడవులు అన్యాక్రాంతం

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- వేలాది చెట్లను నరికేసి కబ్జాకు యత్నిస్తున్న వైనం
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు
- జిల్లాలో 82,130 హెక్టార్లలో అడవులు



మెంగారం మిద్దెమిట్టు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలుతున్న అడవి



చింతల్ గుట్ట తండా శివారులో ఇష్టానుసారంగా నరికేసిన చెట్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): అడవులను మనం రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయి. సకాలంలో వర్షాలు కురవాలన్నా, పంటలు సంవృద్ధిగా పండాలన్నా అడవులను కాపాడాల్సిన అవసరం ఉంది. 'చెట్టు ఉంటే క్షేమం–లేకుంటే క్షామం'', 'అడవికి నిప్పు–ప్రగతికి ముప్పు' అంటూ అటవీ శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్ప వాటిని కాపాడటంలో మాత్రం ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేక దట్టమైన అడవులు సైతం బీడు భూములుగా మారుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో 82,130 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉండగా లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి తాడ్వాయి, మండలాల్లో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో చెట్లు నరికేసిన ఖాళీ ప్రదేశాల్లో కొత్త మొక్కలు నాటడంలో అటవీ శాఖ విఫలమవుతుందని ఆరోపణలున్నాయి. అక్రమ కలప వ్యాపారులను అరికట్టడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వందల ఎకరాల్లో చెట్లను నరికేస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హక్కులు కల్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో..

ప్రభుత్వం ఇటీవల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తామని ప్రకటించడంతో గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో యథేచ్ఛగా చెట్లను నరికేస్తున్నారు. అదను చూసి పంటలకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో లింగంపేట మండలంలోని మెంగారం, బోనాల్, చింతల్‌గుట్ట తండా, నల్లమడుగు, భవానిపేట, ముంబోజిపేట, కొండాపూర్, జల్దిపల్లి, రాంపూర్, కంచుమల్ తదితర గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో సుమారు 6 వేలకు పైగా చెట్లను నరికివేసినట్లు సమాచారం. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే టేకు చెట్లను నరికి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అలాగే కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డులోని మర్రి వృక్షాలకు నిప్పుపెట్టి కూల్చేస్తున్నారు. మెంగారం, బోనాల్, నల్లమడుగు, మిద్దెమిట్టు తదితర ప్రాంతాల్లోని అడవులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అడవులను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వన్యప్రాణుల జీవనం ప్రశ్నార్థకం

దట్టమైన అడవులు గొడ్డలి వేటుకు పలుచబడటంతో వన్యప్రాణుల మనుగడ సైతం ప్రశ్నార్థకంగా మారుతోంది. అడవుల్లో తాగునీరు లేకపోవడంతో వన్యప్రాణులు గ్రామాల శివారులోని పంట చేనుల వద్దకు వస్తున్నాయి. కొద్ది రోజులుగా చిరుత పులులు, ఎలుగుబంట్లు, జింకలు, కొండ గొర్రెలు, కుందేళ్లు, దుప్పిలు, అడవి పందులు తదితర జంతువులు పంట పొలాలకు వచ్చి నీళ్లు తాగి వెళ్తున్నాయి. ఇదే అదునుగా చూసుకొని వేటగాళ్లు జంతువులను వేటాడి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని సాసర్ పీట్లలో నీళ్లు నింపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెట్లు నరికితే కేసులు నమోదు చేస్తాం

చెట్లు నరికితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. లింగంపేట మండలంలోని రెండు తండాలకు చెందిన 8 మందిపై ఇటీవల కేసులు నమోదు చేశాం. అడవికి నిప్పుపెట్టవద్దని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. చెట్లు లేకపోతే ఎదురయ్యే పరిణామాలను ప్రజలకు వివరిస్తున్నాము. వన్యప్రాణులను వేటాడిన వారికి జైలుశిక్ష, జరిమానాలు విధిస్తాం. భూములు ఆక్రమించుకుంటే సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం.

– ఓంకార్, ఎఫ్ఆర్‌వో, ఎల్లారెడ్డి

అరణ్య రోదన



కొత్తాబాది శివారు అడవిలో ఎండిపోయిన చెట్లు

బాన్సువాడ రూరల్: నిజంగా ఇది అరణ్య రోదనే.. బాన్సువాడ నియోజకవర్గంలో అడవులు ఎండిపోతున్నాయి. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని రిజర్వ్ ఫారెస్టులతో పాటు అడవుల్లోని చెట్లు, మొక్కలు ఎండుముఖం పట్టాయి. ఎండలు ముదరడంతో చెట్లకు నీటి లభ్యత తగ్గింది. పచ్చగా పూలు, పండ్లతో నీడనిస్తూ కళకళలాడాల్సిన అటవీ ప్రాంతం నీరు లేక బోసిపోతుంది.

దేవాదాయ శాఖాధికారి వ్యవహారంపై ఆరా..?

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని దేవదాయ శాఖాధికారి ఇంట్లో నిజామాబాద్ ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బంది వచ్చి వ్యక్తిగత పనులు చేస్తున్నారని సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు ఆరా తీసున్నట్లు సమాచారం. అయితే రాష్ట్ర స్థాయి అధికారి ఇంట్లో పనులు చేయడంతో జిల్లా అధికారులు కప్పి పుచ్చుతున్నారని పలువురు దేవదాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఆదివారాలు కూడా వ్యక్తిగత పనులు చేయకపోతే తలకు మించిన బాధ్యతలు చెబుతారన్న భయంతోనే సిబ్బంది ఈ పనులు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఉన్నత హోదాలో ఉండి జిల్లా అధికారులను సమన్వయం చేయాల్సిన వ్యక్తే ఇలా ఇంట్లో మట్టి పనులు చేయించడంతో ఇక అడిగే వారే కరువయ్యారు. సిబ్బందిని రెండు నెలలుగా జిల్లా అధికారే దగ్గరుండి పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రామారెడ్డి: గల్ఫ్‌లో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంపై గల్ఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా గల్ఫ్ కార్మికులను ఏ ప్రభుత్వం ఆదుకోని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. అలాగే మండలంలోని పలువురు గల్ఫ్‌కు వెళ్లి తప్పిపోయారని వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికం

కోటదుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బాన్సువాడ: పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ దీక్ష స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. సోమ, మంగళవారాల్లో కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, ఉప్పరి లింగం, పత్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న బొల్లారం గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం శివారులో గల దుర్గామాత ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గడ్డం ప్రభునారాయణ, శాంతాబాయి దంపతులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. దీంతోపాటు గ్రామంలోని మహిళలు నెత్తిన బోనాలనెత్తుకొని ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్నూర్‌కు చేరుకున్న కొలనుపాక పాదయాత్ర



మద్నూర్ నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మద్నూర్(జుక్కల్): మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి కొలనుపాక పుణ్యక్షేత్రానికి వెళ్తున్న పాదయాత్ర బృందం ఆదివారం మద్నూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న జగద్గురు రేణుకాచార్య మహారాజ్, స్వాములకు, భక్తులకు సంగాయప్ప మఠాధిపతి ఘన స్వాగతం పలికి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ నెల 12న యాదాద్రి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకకి చేరుకుంటామన్నారు.

బీరప్ప కామరాతి కల్యాణోత్సవాలు ప్రారంభం



లింగంపల్లికలాన్‌లో బోనాలు తీస్తున్న గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లికలాన్‌లో బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం బీర్ల పూజారులు సయాలు, రాజయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు గంగబోనాలు తీశారు. ఈ సందర్భంగా బోనాలెత్తుకొని ఆటపాటలతో ఆలయానికి చేరుకున్నారు. దీంతోపాటు ఇళ్లపై సరుగు చల్లారు. సోమవారం గ్రామంలో బీరప్ప, కామరాతి కల్యాణం జరుగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ముగిసిన రమా సత్యనారాయణ ఉత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కామారెడ్డి అర్బన్: స్థానిక గాంధీనగర్‌లో రమా సత్యనారాయణ స్వామి దేవతామూర్తుల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు నారాయణశర్మ, అంజనేయశర్మలు, రాచర్ల రవిచంద్రశర్మ, కాసర్ల విఠల్‌శర్మను సన్మానించారు.

బేడీల మైసమ్మకు బోనాలు



గోర్గల్ బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు



పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): డప్పు చప్పుళ్ల.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. ఆడపడుచుల నెత్తిన బోనాల ప్రదర్శనతో ఆదివారం మండలంలోని గోర్గల్ గ్రామం దద్దరిల్లింది. గ్రామ శివారులోని బేడీల మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ఒడి బియ్యం సమర్పించారు. సాయంత్రం వేళ బోనాల ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన పోతరాజుల విన్యాసాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. పోతరాజులు ఎమ్మెల్యేకు మెడలో కొరడాలు వేసి సత్కరించారు. అనంతరం బేడీల మైసమ్మలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నాయకులు రామాగౌడ్, సాయిలు ఉన్నారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే కూడా హాజరయ్యారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి అర్బన్: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని, క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కల్గుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విపుల్ జైన్ ఏర్పాటు చేసిన ప్రకాష్ చంద్ క్రికెట్ అకాడమీ(పిసిసిఏ)ని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో క్రికెట్ ప్రియుల కోసం అకాడమీని విపుల్‌జైన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్వాడీ సంఘం నాయకులతో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. వాహనదారులకు తిప్పలు



బుడిమి ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డుపై గుంతలు

బాన్సువాడ రూరల్: రోడ్లపై గుంతలు ఏర్పడినా వాటిని సంబంధిత శాఖాధికారులు పూడ్చకపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రాత్రిపూట వాహనాలు గుంతల్లో పడటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాడ్కోల్ గ్రామంతో పాటు బుడిమి రోడ్డులో రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు చోటు చేసుకోకముందే గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పనుల్లో జాప్యంతో ఇబ్బందులు



మల్లయ్యపల్లి శివారులో దుమ్ములో ప్రయాణిస్తున్న వాహనదారులు

ఎల్లారెడ్డిరూరల్: మెదక్ నుంచి రుద్రూర్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులలో ఆలస్యం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డు వెంట ఉన్న సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టులు, వంతెనలు నిర్మిస్తున్న ప్రాంతంలో రోడ్డును డైవర్ట్ చేయడంతో అక్కడ నుంచి వస్తున్న దుమ్ములో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మట్టి రోడ్డుపై నీళ్లు పోసి దుమ్ము లేవకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

యోగా వ్యాప్తికి కృషి అభినందనీయం



ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: లాభాపేక్ష లేకుండా కామారెడ్డి పట్టణంలో గత 16 సంవత్సరాలుగా యోగా కేంద్రాలు నడపడం, యోగా వ్యాప్తికి కృషి చేయడం అభినందనీయమని శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. స్థానిక స్నేహపురి కాలనీలోని ఎస్ఎస్‌వై పతంజలి యోగా కేంద్రం 16వ వార్షికోత్సవానికి పైడి ఎల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, యోగా గురువులు జి.అంజయ్యగుప్తా, పతంజలి యోగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, రఘుకుమార్, ప్రతినిధులు లక్ష్మీపతి, సుదర్శన్, గురుచరణ్, కరుణశ్రీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయపడొద్దు



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ రాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు పరీక్షలు అంటే భయపడొద్దని మోటివేషనల్ స్పీకర్ రాణి అన్నారు. తాడ్వాయిలోని బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఆదివారం ఆమె మోటివేషన్ క్లాసులు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. నిరంతరం ఇష్టంగా చదవాలని సూచించారు. ఇంటివద్ద టీవీలు, సెల్‌ఫోన్లను అధికంగా చూడొద్దన్నారు. తల్లిదండ్రులు పడుతున్న శ్రమను విద్యార్థులు గుర్తించి వారి ఆశయాలను నెరవేర్చి, వారు సంతోషంగా ఉండే విధంగా విద్యార్థులందరూ కృషి చేయాలన్నారు. హైద్రాబాద్ బేగంపేట డిగ్రీ కళాశాల అధ్యాపకులు శైలజ, తాడ్వాయి కళాశాల ప్రిన్సిపల్ సురేఖ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచ విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఏఎస్పీ చైతన్యారెడ్డి

మాచారెడి: పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథన్‌లో ప్రతిభ కనబరిచారు. 5కే, 3కే పరుగు పందెంలో మెడల్స్ సాధించారు. 5కే రన్‌లో పవిత్ర, మౌనిక, పల్లవి, చరణ్, దినేష్, పరమేష్, 3కే రన్‌లో వైష్ణవి, వర్ధిని, రశ్మిత, ప్రశాంతి, అభిలాష్ గౌడ్, దినేష్, ఈశ్వర్, అన్వేశ్, రాంచరణ్ ప్రతిభ కనబరిచారు. వీరిని ఏఎస్పీ చైతన్యారెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డిలు విద్యార్థులను అభినందించారు. అలాగే హైదరాబాద్‌లో సోహం అకాడమీ ఆద్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్‌లో ప్రతిభ కనబరిచి ట్రోఫీ సాధించినట్లు హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి, పీడీ అతీకుల్లా తెలిపారు.

హాకీ టోర్నీలో గర్గుల్ విద్యార్థినుల సత్తా



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి రూరల్: గర్గుల్‌లో ఆదివారం కామారెడ్డి జిల్లా స్థాయి 7 ఎసైడ్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ హాకీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీ బాలికల విభాగంలో గర్గుల్ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలువగా, కేజీబీవీ కామారెడ్డి ద్వితీయ స్థానం సాధించింది. బాయ్స్‌లో ప్రథమ స్థానం గర్గుల్, ద్వితీయ స్థానం బీబీపేట్ సాధించింది. ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి దేవునిపల్లి ఎస్సై రాజు హాజరై గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తాజా మాజీ సర్పంచ్ చింతల రవితేజ, రమేష్ గౌడ్, భార్గవ్ గౌడ్, జనార్దన్ రెడ్డి, నరేష్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గర్గుల్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నోముల మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా పడేసిన సిరంజీలు



పోచారం కట్టపై వాడి పడేసిన సిరంజీలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆస్పత్రుల్లో రోగుల చికిత్సకు వాడిన సిరంజీలను నిర్లక్ష్యంగా పడేసిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చీనూర్ సమీపంలోని పోచారం ప్రధాన కాలువ వెంట గోలిలింగాలకు వెళ్లేదారిలో కాలువకట్టపై పారేశారు. కాలువకట్టపై నిత్యం పశువులు, మేకలు, గొర్లు సంచరించడంతోపాటు ద్విచక్ర వాహనదారులు సైతం వెళ్తుంటారు. ఇంజక్షన్ సీసాలు, సిరంజీలు కాళ్లకు గుచ్చుకుంటే ఇన్‌ఫెక్షన్ అయ్యే అవకాశం ఉంది. మండలకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వీటిని పారేసి ఉంటారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాడేసిన వైద్య సామగ్రిని నిర్లక్ష్యంగా పారేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం పోలీసులు, వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని వాహనదారులకు ఎస్సై మహేశ్ సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఆర్థిక సాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): డీఎస్సీ– 2024 గణిత విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచి లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరి వారం రోజుల్లో ప్రమాదవశాత్తూ మృతి చెందిన వైపీ. గిరి కుటుంబ సభ్యులకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జూకంటి బాపురెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. అనివార్య కారణాల వల్ల సీపీఎస్ ఉద్యోగులు చనిపోతే తన వంతుగా తాను సర్వీసులో ఉన్నంత కాలం ప్రతీ ఏటా రూ.5వేలు అందజేస్తానని తెలిపారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రవీందర్‌శర్మ, ఉపాధ్యాయులు సుధాకర్, రజినీకాంత్, స్వామి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో 5 నుంచి ఆధార్ సేవలు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో ఈ నెల 5 నుంచి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సబ్ పోస్టు మాస్టర్ సూర్య తెలిపారు. ఆధార్ సేవలు 12 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డులో సవరణలు, పుట్టిన తేదీ, వయసు, అడ్రస్ మార్పు, మొబైల్ నంబర్, ఈ మెయిల్, బయోమెట్రిక్స్, ఫోటో,వేలి ముద్రలు రాని వారు తప్పు ఒప్పులు సరి చేసుకోవచ్చన్నారు.సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొచ్చి మార్పు చేసుకోవాలన్నారు.

'బీఆర్ఎస్‌కు ఆదరణ తగ్గలేదు'



బాన్సువాడ రూరల్: ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ ఏమాత్రం తగ్గలేదని, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ యువజన నాయకులు అన్నారు. ఆదివారం బోర్లంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లు, డైరీలను కార్యకర్తలకు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతుంటామన్నారు. మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు మన్నె అనిల్, మమ్మాయి కాశీరాం, నల్లోల్ల సాయిలు, గంగారాం, గంగాధర్, హఫీజ్ పాల్గొన్నారు.

రక్తదాతల ప్రతినిధులకు అభినందనలు



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం విశేష కృషి చేస్తున్న కామారెడ్డి రక్తదాతల సమూహం ప్రతినిధులను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఢిల్లీ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తాలు అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఐవీఎఫ్ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహం ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అశోక్ అగర్వాల్ ప్రస్తావించి అభినందించారు. ఐవీఎఫ్ నాయకులు బాలు, జమీల్, గంప ప్రసాద్, ఎర్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పదు



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కుశాల్ అన్నారు. ఆదివారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సూరయ్య పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం పనిచేసి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి వారి జీవితాల్లో వెలుగు నింపడమే తన కర్తవ్యంగా సూరయ్య భావించారన్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజానికి ఆదర్శంగా నిలిచేది ఒక్క గురువు మాత్రమేనని అన్నారు. అనంతరం సూరయ్యను ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు షౌకత్‌అలీ, రామస్వామి, మండల పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రవీందర్‌శర్మ, రాజాగౌడ్, శోభారాణి, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.